అనకాపల్లి దశ మారుస్తా..

కూటమితోనే భవిష్యత్తు

విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి

- రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన పోరాటం
- యువతకు ఉపాధి, ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం
- వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి
- వారాహి విజయభేరి సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్

అనకాపల్లి/ కొత్తూరు/ అనకాల్లి టౌన్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే అనకాపల్లి దశ మారుస్తానని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కూటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉందని, ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.



అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన అశేష ప్రజానీకం



అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణతో కలిసి అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్


యువతకు ఉపాధి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి, మూతపడిన చక్కెర కర్మాగారాల పునరుద్ధరణ, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ మన ముందున్న సవాళ్లని, కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమే జనసేన పోరాడుతోందని, అధికారం కోసం కాదని పవన్ స్పష్టం చేశారు.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం అనకాపల్లి నెహ్రూ చౌక్‌లో నిర్వహించిన వారాహి విజయభేరి యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో అనకాపల్లి జన సంద్రాన్ని తలపించింది. సుంకరమెట్ట కూడలి నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీగా వచ్చిన జనసేనానికి అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూ చౌక్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వైసీపీ కోడి ఒక గుడ్డు పెట్టింది, ఒక డిప్యూటీ సీఎంను ఇచ్చింది కానీ ఒక మంచి రోడ్డు వేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించుకుంటే కేంద్రం సహకారంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై తరచూ గళమెత్తే నేత కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యేగా గెలిస్తే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని నష్టాల సాకుతో మూసేశారని, అధికారంలోకి వచ్చాక తెరిపిస్తామన్న వైసీపీ నేతలు దానిని రియల్ ఎస్టేట్ వీస్‌గా మార్చేసి రూ.300 కోట్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీనికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తుమ్మపాల ఫ్యాక్టరీకి అనుసంధానంగా ఇథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఏడు వేల మంది ... మిగతా 6వ పేజీలో

జనసేనానికి నీరాజనం

- దారి పొడవునా పూలవర్షం
- అడుగడుగునా మహిళల మంగళ హారతులు
- గజమాలతో అభిమానుల సత్కారం



అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం అనకాపల్లి వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు.

జలగలమదుం జంక్షన్ సమీపాన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3.45 గంటలకు వచ్చారు. ఆయనకు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకే వీఏ నారాయణరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జనసేన అభ్యర్థులు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, కూటమి పార్టీల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పవన్‌కల్యాణ్‌ను కొణతాల రామకృష్ణ సత్కరించి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం పలువురు నాయకులు కొణతాల సమక్షంలో జనసేనలో చేరారు. సాయంత్రం 5.25 గంటలకు వారాహి విజయయాత్ర హెలీప్యాడ్ నుంచి ప్రారంభమైంది. ఈ ర్యాలీ సత్తెమ్మ తల్లి ఆలయ ముఖద్వారం, ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, వన్‌వే ట్రాఫిక్ జంక్షన్, చేపల బజారు మీదుగా నెహ్రూచౌక్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంది. ఓపెన్ టాప్ వాహనం పైనుంచి ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా అభిమానులు, పార్టీ నాయకులు పూలవర్షం కురిపించారు. పలుచోట్ల మహిళలు మంగళహారతులు ఇచ్చారు. రింగురోడ్డు జంక్షన్‌లో ఒక యువతి చేతిలో హారతిని వెలిగించి పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు. సత్యనారాయణ థియేటర్ వద్ద ఒక చంటి బిడ్డను పవన్‌కల్యాణ్ ముద్దాడారు. ఈ ర్యాలీలో మార్గమధ్యంలోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, వేల్పులవీధి గౌరీ పరమేశ్వరులను వాహనం పైనుంచే దర్శించుకున్నారు. ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు దారి పొడవునా బందోబస్తు నిర్వహించారు.



బెల్లం దిమ్మ చూపుతున్న పవన్ కల్యాణ్

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

గంగవరంలో చెలరేగిపోతున్న అక్రమార్కులు

పోలీసులు హెచ్చరించినా బేఖాతరు

- చోద్యం చూస్తున్న మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు

సబ్బవరం, ఏప్రిల్ 7: మండలంలోని గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగి పోతున్నారు. వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో పలు చోట్ల మట్టి, గ్రావెల్‌ను సుమారు 20 అడుగుల మేర తవ్వి తరలించుకుపోతున్నారు. గంగవరానికి ఆనుకుని ఉన్న పరవాడ మండలం పెదముషిడివాడ, ఇ.మర్రి పాలెం జగనన్న కాలనీలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.





శనివారం ఉదయం గ్రావెల్ తవ్వకాలకు వచ్చిన ఎక్సకవేటర్

జగనన్న లేఅవుట్లలో పరిహారం కింద రైతులకు ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్ల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ అధికారులు గ్రావెల్ తవ్వుతున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు అక్కడా, ఇక్కడా అని కాకుండా గ్రావెల్‌ను లేఅవుట్లు, దానిని ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతాల్లో తవ్వి తరలించుకు పోతున్నారు. అక్రమార్కులకు అధికార పార్టీకి చెందిన నాయకులు అండదండలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. గంగవరానికి చెందిన వలంటీర్ కూడా ఇదే పనిలో ఉన్నట్టు చెబుతున్నారు.

పోలీసులు హెచ్చరించినా..

15 రోజుల క్రితం ... మిగతా 6వ పేజీలో

15 నుంచి చేపల వేటకు విరామం

- 61 రోజుల పాటు సముద్రంలో వేట నిషేధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మత్స్యశాఖ హెచ్చరిక

అనకాపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సముద్రంలో చేపల వేట నిషేధం అమలులోకి రానుంది. ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు అంటే 61 రోజుల పాటు చేపల వేట నిషేధం విధిస్తూ జిల్లా మత్స్యశాఖ ఏడీ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సముద్రంలో మెకనైజ్డ్, మోటారు బోట్లు ద్వారా అన్ని రకాల చేపల వేట సాగించరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో 73 కిలో మీటర్ల పరిధిలో సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. 32 గ్రామాల్లో 28 చేపల రేవు కేంద్రాలు ఉన్నాయి. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 12,996 మంది మత్స్యకారులు 2,032 బోట్ల ఆధారంగా సముద్రంలో చేపల వేట సాగించి జీవిస్తున్నారు. వేట నిషేధ కాలంలో ప్రభుత్వం భృతి మంజూరు చేస్తుంది.

చేపల వేట నిషేధం ఎందుకంటే..

సముద్రంలో చేపలు, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం ముఖ్య ఉద్దేశంగా సముద్రంలో చేపల వేట నిషేధాన్ని గత కొన్నేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ నెల 15వ తేదీ నుంచి 61 రోజుల పాటు మెకనైజ్డ్, మోటారు బోట్లు వినియోగించే మత్స్యకారులు ఎటువంటి చేపల వేట సాగించకుండా మత్స్య ఉత్పత్తి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి చేపల వేటకు వెళితే బోట్ల యజమానులను ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టానికి లోబడి చర్యలు తప్పవని, నిషేధాజ్ఞలను అతిక్రమించిన మత్స్యకారుల బోట్లలో మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడమే కాకుండా జరిమానా విధించనున్నట్టు మత్స్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం అందించే డీజిల్ ఆయిల్ సబ్సిడీ, అన్ని రకాల సబ్సిడీ సౌకర్యాలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదం

- ఇద్దరి మృతి, నలుగురికి అస్వస్థత
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

పరవాడ, ఏప్రిల్ 7: విశాఖ ఫార్మాసిటీ ఉలిక్కిపడింది. శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారు జామున వేర్వేరు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో నలుగురు అస్వస్థతకు గురికాగా, ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీక్ అవ్వడంతో కెమిస్ట్, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రమణ(30) మృతి చెందగా, మరో నలుగురు అస్వస్థతకు గురయ్యారు. అలాగే అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) మృతి చెందాడు. మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదాలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



మృతుడు సీహెచ్. రమణ (ఫైల్ ఫొటో)



మృతుడు ఆళ్ల గోవింద (ఫైల్ ఫొటో)



ఆల్కలీ పరిశ్రమలో మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైన జీజీ-2 ట్యాంక్ ఇదే

ఆల్కలీ పరిశ్రమలో..

ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్ -3 పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజాము నాలుగున్నర గంటల ప్రాంతంలో ప్రొడక్ట్ బ్లాక్‌లోని జీజీ-2 ట్యాంక్ పైపులైన్ వద్ద మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. పైపులైన్‌కు సంబంధించి ఎల్ బెండ్ వద్ద లీకేజీ కావడంతో సీ షిఫ్ట్ విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) విపరీతంగా గ్యాస్ పీల్చడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. పైఫ్లోర్‌లో పనిచేస్తున్న కార్మికులకు గ్యాస్ వాసన రావడంతో కిందకు దిగి వచ్చి చూసేసరికి అప్పటికే రమణ అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యంలో మృతి చెందాడు. అలాగే అతనిని చూసేందుకు వచ్చిన నలుగురు కార్మికులు ఎ.శ్రీనివాసరావు (పైడివాడ అగ్రహారం), వై.గోపాల్ (రేగడివలస), వి.అప్పారావు (లంకెలపాలెం), బి.రవీంద్ర (చోడవరం) అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కార్మికులు వారిని ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.15
సహరి (మంగళ)	4.29

మండుతున్న ఎండలు

- అనకాపల్లిలో 38.8 డిగ్రీల ఉష్ణోగ్రత

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: అనకాపల్లిలో ఎండల తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. అనకాపల్లిలో ఆదివారం 38.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత, 25.2 అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. శనివారంతో పోలిస్తే ఒక డి గ్రీ ఉష్ణోగ్రత తగ్గినప్పటికీ వడగాడ్పులు మాత్రం తగ్గకపోవడంతో రోడ్లపై రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడక తప్పలేదు. పట్టణంలోని పలు ప్రధాన రహదారులు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నిర్మానుష్యంగా కనిపించాయి. గుండాలవీధి, మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, శారదా వంతెన రోడ్లు జనసందడి లేక బోసిపోయాయి.



నిర్మానుష్యంగా ఉన్న గుండాల జంక్షన్

వైభవంగా నూకాంబిక జాతర ప్రారంభం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర బాలాలయంలో ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ఆలయ ఈవో బండారు ప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి జాతర పూజను ఈవో ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో ప్రసాద్

నేటి సాయంత్రం ఐదు గంటల వరకే దర్శనం

కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకే భక్తులకు నూకాంబిక అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అమావాస్య సందర్భంగా బాలాలయంలో అమ్మవారికి అమావాస్య పూజ చేస్తామన్నారు. ఈ పూజ కారణంగా ఐదు గంటల వరకే భక్తులకు దర్శనం కల్పించి ఆలయం మూసివేస్తామన్నారు. తిరిగి మంగళవారం తెల్లవారుజాము ఆరు గంటల నుంచి బాలాలయంలో అమ్మవారి దర్శనాలు భక్తులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

క్రైం... crime news

తురువోలులో జీడిమామిడి తోటలు దగ్ధం


తురువోలులో దగ్ధమైన జీడిమామిడితోట

చీడికాడ, ఏప్రిల్ 7: మండలంలోని తురువోలు గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన జీడి మామిడితోటలు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 5లక్షల వరకు నష్టం ఉంటుందని అంచనా. గ్రామానికి చెందిన పోతల సూర్యం, గొర్రు పోటు అప్పలనాయుడు, గొర్రుపోటు పైడితల్లిబాబులకు చెందిన జీడిమామిడితోటల్లో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిమంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం మేరకు చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేసింది. అప్పటికే సుమారు రెండు ఎకరాల్లో పంట దగ్ధమైంది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

1,800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం


సారా బట్టీలపై దాడి చేసిన ఎస్‌ఈబీ సిబ్బంది

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7: బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాల్లో ఎస్‌ఈబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో 1,800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. బుచ్చెయ్యపేట మండలం ఆర్. శివరాంపురంలో సారా బట్టీలపై దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం పులుసును ఎక్సైజ్ శాఖ పోలీసులు ధ్వంసం చేశారు. చోడవరం ఎస్‌హెచ్‌ఓ (ఎస్‌ఈబీ) బీహెచ్. కిరణ్ మహేశ్వరి ఆధ్వర్యంలో ఎస్ఐ పి.అప్పారావు, సిబ్బంది దాడి చేసి ప్లాస్టిక్ డ్రమ్‌ల్లో నిల్వచేసిన బెల్లం పులుసును పారబోశారు. దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామంలో సారా తయారీకి నిల్వచేసిన 800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ కిరణ్ మహేశ్వరి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలుగొట్టిన దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని కాగిత గ్రామంలో వ్యవసాయానికి కరెంటు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లో వున్న కాపర్ (రాగి వైరు)ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ మేరకు స్థానిక ఏఈ కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాగిత గ్రామంలో వ్యవసాయ బోర్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఆదివారం ఉదయం స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఏఈ కృష్ణ, సిబ్బంది పరిశీలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు ఏఈ చెప్పారు.

ప్రభుత్వ భూమిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం

▸▸ అడ్డుకున్న స్థానికులు


పైడివాడఅగ్రహారంలో లే-అవుట్ యజమానితో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

సబ్బవరం, ఏప్రిల్ 7 : మండలంలోని పైడివాడఅగ్రహారంలో ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా ఎన్నికలు ముగిసే వరకూ కాంపౌండ్ వాల్ నిర్మించవద్దని చెప్పినా రియల్టర్ దౌర్జన్యంగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని స్థానికులు ఆదివారం పనులు అడ్డుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, టీడీపీ నాయకులు అక్కిరెడ్డి దుర్గినాయుడు తదితరులు మాట్లాడుతూ.. పైడివాడ అగ్రహారం సర్వే నంబర్ 1లో గతంలో ఎన్టీఆర్ కాలనీ మంజూరు చేయగా, తాజాగా వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ మంజూరు చేసిందన్నారు. ఈ రెండు కాలనీలకు లంకెలపాలెం-అనకపల్లి రోడ్డు నుంచి సర్వే నంబరు 1 ప్రభుత్వ భూమి నుంచి 40 అడుగుల మార్గం ఇచ్చారన్నారు. రీ సర్వేలో సదరు రోడ్డు స్థలం ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో జిరాయితీలో కలిసి ఉందని, ఆ భూమి కొన్న రియల్టర్ వాదిస్తున్నారన్నారు. సదరు రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కొన్ని రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు.ఇప్పటికే కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మించాడని, మిగతా చోట కూడా నిర్మాణం చేస్తుండగా అడ్డుకున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది స్పందించి రోడ్డు మార్గం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై డీఎస్పీ ఎస్. అప్పలరాజు, పట్టణ సీఐ జి. శంకరరావు, ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు, ఆలయ ఈవో బండారు ప్రసాద్‌లకు భద్రతాపరమైన సూచనలు చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు కూడా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు ఆశీర్వాదం అందజేశారు.


చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

అపూర్వ స్వాగతం

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు అనకాపల్లి వాసులు ఘన స్వాగతం పలికారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలో జనసేనాని పర్యటించారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. దారిపొడవునా మహిళలు, యువకులు పుష్పవర్షం కురిపించారు. గాజు గ్లాస్ గుర్తును మహిళలు ప్రదర్శించారు. జనాదరణ చూసి పవన్‌కల్యాణ్ మురిసిపోయారు. పవన్‌కల్యాణ్ వారాహి యాత్రను చాలా మంది తమ సెలఫోన్లలో బంధించారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, బొకేలతో పవన్‌కల్యాణ్‌ను సత్కరించారు.


అనకాపల్లి రోడ్‌షోలో కార్యకర్తలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభివాదం




జనసేన ఫ్లెక్సీతో చెట్టెక్కిన అభిమాని


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రమేశ్


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కొణతాల రామకృష్ణ


పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బుద్ధా నాగజగదీశ్వరరావు


టీడీపీ, జనసేన, బీజేపీల జెండాలతో అభిమాని


చిన్నారితో జనసేన అధినేత పవన్‌కల్యాణ్


రోడ్‌షోలో పవన్‌కల్యాణ్ అభివాదం


పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీతో అభిమానులు


గాజు గ్లాసు గుర్తుతో మహిళలు


ఆర్టీసీ బస్సు లోపల నుంచి పవన్‌కల్యాణ్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న ప్రయాణికులు


పవన్‌కల్యాణ్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న మహిళలు

పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరికలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జలగలమదుం జంక్షన్ సమీపంలోని హెలీప్యాడ్ వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, అనకాపల్లి వైసీపీ నాయకులు సకల గోవిందరావు, రాష్ట్ర ఫిషర్ మాన్ జేఏసీ చైర్మన్ కంబాళి అమ్మోరయ్య, రాంబిల్లి మండలం సీతపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు (బుజ్జి), ఏటికొప్పాక ఎంపీటీసీ సభ్యుడు అన్నం వెంకట్రావు, కశింకోట మండలం పరవాడపాలెం సర్పంచ్ ముసలినాయుడు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నట్టు జనసేన పార్టీ కార్యాలయం తెలిపింది.




పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన తోట నగేష్, సకల గోవిందరావు

పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తా

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తానని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. ఆదివారం గాంధీనగరంలో జరిగిన వెలమ సంక్షేమ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ తాను ఎంపీగా ఎన్నికైతే పార్లమెంట్ నియోజకవర్గంలో రూ. ఆరు వేల కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. అనకాపల్లిలోనే ఉండి తన స్వగ్రామంలా మార్చుకుంటున్నానన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల రీత్యా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మాత్రమే అభివృద్ధి చేసి చూపించగలదన్నారు. వెనుకబడిన అనకాపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికే బీజేపీ పెద్దలు నన్ను అనకాపల్లికి పంపించారన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పలు విషయాలను సీఎం రమేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, బీజేపీ నాయకులు పీవీఎన్ మాధవ్, సురేంద్రమోహన్, ఈర్లె శ్రీరామ్మూర్తి, పరుచూరి భాస్కరరావు, డి.పరమేశ్వరరావు, సంఘ ప్రతినిధులు బీమా, రాజాన అప్పారావు, రాజేంద్రప్రసాద్, పీఎస్ నాయుడు, పెదపాటి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారానికి అంగీకారం

పరవాడ, ఏప్రిల్ 7: ఫార్మాసిటీలోని ఆల్కలీ మెటల్స్, అపిటోరియా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన సీహెచ్. రమణ, ఆళ్ల గోవింద కుటుంబాలకు యాజమాన్యాలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించాయి. ఈ మేరకు ఆదివారం మృతుల కుటుంబసభ్యులతో యాజమాన్యాలు చర్చలు జరిపాయి. ఆల్కలీ పరిశ్రమ యాజమాన్యం సీహెచ్. రమణ కుటుంబానికి రూ.35 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాయి. అలాగే అపిటోరియా పరిశ్రమ యాజమాన్యం ఆళ్ల గోవింద్ కుటుంబానికి రూ. 32 లక్షలు నష్టపరిహారంతోపాటు దహన సంస్కార ఖర్చులు నిమిత్తం రూ. 50వేలు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఫార్మా యాజమాన్యాల ప్రతినిధులు కమలాకర్‌రెడ్డి, రామకృష్ణ, శర్మ, రవిశంకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి.. అక్రమార్కులకు సిరి..!

▸▸ పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో మాయమవుతున్న చెట్లు

▸▸ పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

▸▸ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వనసంరక్షణ సమితి సభ్యులు


పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో గాంధీనగరం వీఎస్ఎస్ సభ్యులు పెంచిన నీలగిరి చెట్లు

కష్టం ఒకరిది.. ప్రతిఫలం మరొకరిది అన్న నానుడిని అక్రమార్కులు బాగా వంటపట్టించుకున్నారు. అందుకే ఎక్కడైనా ఏపుగా పెరిగిన చెట్టు కనిపించినా.. గెడ్డలు, నదుల్లో ఇసుకను చూసినా.. ఇలా ఏది వారికంట పడినా కాజేస్తుంటారు. అందునా ప్రభుత్వ ఆస్తులైతే రెక్కలు కట్టుకుని మరీ వాలిపోతుంటారు. వీరిని కట్టడి చేయాల్సిన అధికారులు కళ్లకు గంతలు కట్టుకుంటుండడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటివారే రెండు దశాబ్దాలకు పైబడి వన సంరక్షణ సమితి సభ్యులు పెంచుకున్న చెట్లను గుట్టుగా నరుక్కుని పోతూ జేబులు నింపుకుంటున్నారు.

నాతవరం, ఏప్రిల్ 7 : మండలంలోని పెడిమికొండ రిజర్వుఫారెస్టులో నీలగిరి (యూకలిప్టస్) చెట్లు మాయమవుతున్నాయి. 2001లో అటవీ శాఖ అధికారులు ఈ మొక్కలను సరఫరా చేయగా, అప్పటి వన సంరక్షణ సమితి చైర్మన్ కొత నూకరాజు ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితి సభ్యులు 25 ఎకరాలలో వీటిని నాటారు. ఇవి పెద్ద చెట్లుగా పెరిగిన తర్వాత నరికి ఆ కలప విక్రయించగా వచ్చిన ఆదాయంలో సగం అటవీ శాఖకు, సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి వినియోగించాలని అప్పట్లో ఒప్పందం కుదిరినట్టు గ్రామస్థులు చెపుతున్నారు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. ఇదిలావుంటే, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ తోటలో చెట్లను అక్రమార్కులు అక్కడక్కడా నరుక్కుని తరలించుకుపోతున్నారు. నాతవరం మండలం తుని- నర్సీపట్నం రూట్‌లో గాంధీనగరం దగ్గర ఈ నీలగిరి తోటలు ఉండగా చివరిలో చెట్లను కొందరు గుట్టుగా నరుక్కుని పోతున్నట్టు పలువురు చెపుతున్నారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి ఈ చెట్లను నరికించేందుకు టెండర్లను ఆహ్వానించాలని, వాటిని విక్రయించగా వచ్చిన ఆ ఆదాయంలో సగం అటవీశాఖకు, మిగిలిన సగం గాంధీనగరం గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. మరీ ఆలస్యం చేస్తే మరిన్ని చెట్లను అక్రమార్కులు నరుక్కుని పోవడం ఖాయమని అంటున్నారు. ఈ అంశాన్ని నాతవరం మండల అటవీ శాఖాధికారి మహేష్ వద్ద ప్రస్తావించగా, నిబంధనల మేరకు టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.




చెట్లను నరుక్కు పోతుండడంతో మిగిలిన మోళ్లు

జనసేనలో చేరిన వైసీపీ నేత డీఎస్ఎన్ రాజు



అనకాపల్లిలో పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన డీఎస్ఎన్ రాజు

రాంబిల్లి, ఏప్రిల్ 7 : మండలం సీతపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు డీఎస్ఎన్ రాజు (బుజ్జి) ఆదివారం అనకాపల్లిలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీఎస్ఎన్ రాజుకు పవన్‌కల్యాణ్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం డీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి కృషి చేయాలని, ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌లకు ఘన విజాయాన్ని అందించేందుకు కృషి చేయాలని పవన్‌కల్యాణ్ సూచించారన్నారు. డీఎస్ఎన్ రాజు పార్టీలోకి చేరడంతో జనసేన నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు.

కోటవురట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తాతారావు పర్యటన

కోటవురట్ల, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి బోను తాతారావు ఆదివారం మండలంలోని లింగాపురం, కొడవటిపూడి, కేవెంకటాపురం, కోటవురట్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్య నేతలను కలిశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేరాష్ట్రానికి ప్రత్యేకహోదా, రాష్ట్రానికి రాజధాని, పోలవరం సాధ్యమవుతాయన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నడింపల్లి నూకరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే మత్స్యకారుల సంక్షేమం : అనిత



ఎన్నికల ప్రచారం చేస్తున్న అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 7: వైసీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెదతీనార్లలో ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు మంజూరయ్యాయని హడావిడి చేశారే తప్ప, కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో కురందాసు నూకరాజు, మేరుగు నాగేశ్వరరావు, గోసల చిన తాతారావు, కొప్పిశెట్టి బుజ్జి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో సుందరపు ప్రచారం



పాతవీధిలో ప్రచారం చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 7: మునిసిపాలిటీలో జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేష్, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. పాత వీధి, తులసీనగర్, సతకంపట్టు, దిమిలి రోడ్డు, పిల్లా వారి వీధుల్లో ఇంటింటా ప్రచారం చేసి గాజు గ్లాసు గుర్తుతో పాటు కమలం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొఠారు సాంబ, కొలుకులూరి విజయ్‌బాబు, జనసేన నేతలు కొఠారు నరేష్, లవుడు లోవరాజు, బీజేపీ నేతలు పిట్టా దాసుబాబు, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

అచ్యుతాపురం, ఏప్రిల్ 7: మండలంలో మత్స్యకార్ల గ్రామాలైన పూడిమడక, తంతడి పంచాయతీల నుంచి వైసీపీ శ్రేణులు ఆదివారం జనసేనలోకి చేరాయి. తంతడి పంచాయతీ వార్డు మెంబర్లు తుట్ట ఒనుములు, వంక కృష్ణ, చోడిపల్లి కాసులు, చిన్నతల్లి దేముడు, పెదపల్లి అప్పలాచారి, మాజీ ఉపసర్పంచ్ వంక పైడిరాజు, కర్రి పైడిరాజు అనుచరులతో జనసేనలో చేరారు. అలాగే పూడిమడకలో వైసీపీ గ్రామ అధ్యక్షుడు సూరాడ ధనరాజ్, ఉపసర్పంచ్ భర్త గంగిరి రవి, ఎంపీటీసీ తనయుడు పిపినాయుడుతోపాటు వారి అనుచరులు జనసేనలో చేరారు. వీరందరికి జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు బైలపూడి శ్రీరామదాసు, మోటూరు శ్రీవేణి, ద్వారపురెడ్డి బాపూజీ, రాజాన సన్యాసినాయుడు, రాజాన నానాజీ పాల్గొన్నారు.

మిలట్రీ కాలనీలో చెత్తకు నిప్పు

▸ వ్యాపించిన మంటలు.. తప్పిన ప్రమాదం

ఎలమంచిలి, ఏప్రిల్ 7: మునిసిపాలిటీలోని మిలట్రీ కాలనీ సమీపంలో మునిసిపల్ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి కారుతోపాటు స్థానికులకు పెద్ద ముప్పు తప్పింది. ఆదివారం ఉదయం పారిశుధ్య సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టి వెళ్లిపోయారని, కొంత సమయానికి మంటలు వ్యాపించాయని, సమీపంలోని కారు వద్దకు చేరుకున్నాయని, వెంటనే కారును తొలగించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని కోరుతూ స్థానికులు వాట్సాప్ గ్రూపు ద్వారా అధికారులను కోరారు.

చంద్రబాబు, మోదీలతోనే సుపరిపాలన

▸ జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, ఏప్రిల్ 7 : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, కేంద్రంలో నరేంద్రమోదీలతోనే సుపరిపాలన అందుతుందని జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం ముత్యాలమ్మపాలెంలో జరిగిన కార్యక్రమంలో పంచకర్ల మాట్లాడుతూ.. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, తనను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన తిక్కవాని పాలెం సర్పంచ్ చేపల మసేనుతో పాటు వార్డు మెంబర్లు పంచకర్ల సమక్షంలో జనసేనలోకి చేరారు. అలాగే ముత్యాలమ్మపాలెంకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు, పంచాయతీ వార్డు మెంబర్లు, ఆలయాల కమిటీ ప్రతినిధులు జనసేనలో చేరారు. వీరందరికీ పంచకర్ల కండువాలు వేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, రావాడ, బొద్దపువానిపాలెం సర్పంచ్‌లు మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి



విద్యుత్ స్తంభాన్ని ఆనుకుని తవ్వకాలు జరిపిన దృశ్యం

స్థానిక సీఐ పిన్నింటి రమణ గంగవరంలో ఎక్స్‌కవేటర్, లారీలు ఉన్న, గతంలో కేసులు నమోదైన సుమారు 20 మందితో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించారు. యంత్రాలు సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే కొన్ని రోజులు గ్రావెల్ తరలింపునకు విరామం ఇచ్చి గత రెండు రోజులుగా మళ్లీ తవ్వకాలు ప్రారంభించారు. శనివారం ఉదయం పట్టపగలు ఎక్స్‌కవేటర్ సాయంతో లేఅవుట్ తవ్వేసి మట్టిని తవ్వుకుపోయారు. దీనిపై స్థానిక సీఐని సంప్రతించగా ఇప్పటికే సుమారు 20 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. ఎన్నికల హడావిడిలో ఉండగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని, నిఘా పెట్టి యంత్రాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు

‘పేట’ను వీడని ట్రాఫిక్ సమస్య

▸ ఆక్రమణలతో ఇరుకుగా మారిన మెయిన్‌రోడ్డు

▸ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



చిత్రమందిర్ థియేటర్ ఎదుట రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

పాయకరావుపేట, ఏప్రిల్ 7 : పట్టణంలోని మెయిన్‌రోడ్డు పునర్నిర్మాణం జరిగి నెలలు గడుస్తున్నా ఆక్రమణలు తొలగించకపోవడంతో ట్రాఫిక్ సమస్య వీడడం లేదు. పట్టణంలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు రెండు కిలోమీటర్లున్న మెయిన్‌రోడ్డును ఇరువైపులా పలు వ్యాపార సంస్థల యాజమాన్యాలు ఆక్రమించి షెడ్లు వేయడంతో ఇరుకుగా మారి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న విషయం తెలిసిందే. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెయిన్‌రోడ్డు విస్తరణ చేయాల్సి ఉన్నప్పటికీ కోర్టు వ్యాజ్యం, నిధుల కొరత తదితర కారణాలతో జరగడం లేదు. దీంతో ఆక్రమణల తొలగించకుండా మెయిన్‌రోడ్డుపై గోతులు పూడ్చి, దానిపై లేయరువేసి వదిలేశారు. దీంతో మరికొద్ది సంవత్సరాలు మెయిన్‌రోడ్డు విస్తరణ, ఆక్రమణల తొలగింపు జరిగే పరిస్థితులు కానరావడం లేదు. ఫలితంగా పాయకరావుపేటలో ట్రాఫిక్ సమస్య ఇప్పట్లో తీరే అవకాశం లేకుండా పోయింది. పట్టణంలో పీహెచ్‌సీ, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆనుకుని ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకున్నవారులేరు. దీనికితోడు పార్కింగు స్థలాలు లేకున్నా పలు షాపింగ్ కాంప్లెక్సులకు అధికారులు ఎడాపెడా అనుమతులిస్తున్నారు. ఆయా షాపింగ్ కాంప్లెక్స్‌లు, మాల్స్‌కు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుదల చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. ముఖ్యంగా స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన ఓ షాపింగ్ మాల్ ఎదుట ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి పలుమార్లు ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు నరకాన్ని చవిచూశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. దీనిపై సీఐ పి.అప్పలరాజుని వివరణ కోరగా ట్రాఫిక్ సమస్యపై షాపింగ్ మాల్ యాజమాన్యానికి పలుమార్లు హెచ్చరించామని, ఇపుడు నోటీసు ఇస్తున్నామని తెలిపారు.

దిమిలి జంక్షన్‌లో ట్రాఫిక్ టెన్షన్

▸ ఆదివారం వచ్చిందంటే వాహనచోదకులకు అవస్థలు

▸ అమలుకు నోచుకోని వన్‌వే నిబంధన

▸ పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



దిమిలి జంక్షన్‌లో నిలిచిన వాహనాలు

ఎలమంచిలి, ఏప్రిల్ 7: పట్టణంలోని దిమిలి జంక్షన్‌లో ఆదివారం వచ్చిందంటే ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. అసలే ఇరుకురోడ్డు, ఆపై దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాల పార్కింగ్, వన్ వే నిబంధనలు అమలుకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ స్తంభించి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ జంక్షన్‌లో కూరగాయల మార్కెట్, చికెన్ సెంటర్లు, చేపలు మార్కెట్ ఉండడంతో ఆదివారం ఉదయం సుమారు అర్ధగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఈ రోడ్డులో వన్‌వే నిబంధన ఉన్నా అమలుకాకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భానుడి భగభగ

▸ వడగాడ్పులు, ఉక్కపోతకు వృద్ధులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరి

▸ బయటకు వచ్చేందుకు భయపడిన ప్రజలు



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల మెయిన్ రోడ్డు



జనం లేక బోసిపోయిన అచ్యుతాపురం రోడ్డు

కోటవురట్ల ఏప్రిల్ 7: రోజురోజుకు భానుడు భగభగమండుతున్నాడు. గత నాలుగు రోజుల నుంచి ఎండలు, వడగాడ్పులకు, ఉక్కపోతకు, వృద్ధులు, పిల్లలు అపసోపాలు పడుతున్నారు. ఎండల తీవ్రతకు ఇంటిలో ఏ వస్తువు పట్టుకున్న కాలిపోతున్నాయి. సాయంత్రం 5గంటలు దాటినా వడగాడ్పులు తగ్గలేదు. ఉదయం 10గంటల నుంచి జనం రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకి పెరుగుతుండడంతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం ఉష్ణోగ్రత 39 డిగ్రీలు నమోదైంది. మధ్యాహ్నం 11 గంటలు దాటితే కోటవురట్ల మెయిన్‌రోడ్డు నిర్మానుష్యం అవుతున్నది.

అచ్యుతాపురంలో.. భానుడు ప్రతాపానికి ఆదివారం మండల ప్రజలు విలవిలలాడారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమైంది. పది గంటలకు ఎవరూ ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఉక్కపోతకు ప్రజలు ఇళ్లలోని కూడా ఉండలేకపోయారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి వడగాడ్పులు ప్రారంభమయాయి. అచ్యుతాపురం రోడ్లు 12 గంటలకు ఖాళీ అయిపోయాయి. సెజ్‌లో కర్మాగారాలకు వచ్చే భారీ వాహనాలు చెట్ల కింద ఆపేశారు. రోడ్లపై ప్రజలు ఎండవేడిమికి తలపై తువ్వాళ్లు కప్పుకోవలసి వచ్చింది. సాయంత్రం ఐదున్నర వరకు ఎండవేడి తగ్గలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సర్వాంగ సుందరంగా నూకాంబిక ఆలయాలు



కొప్పుగొండుపాలెంలో నూకాంబిక అమ్మవారు

పాయకరావుపేట, ఏప్రిల్ 7 : స్థానిక కంటోన్మెంట్ ఏరియాలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం కొత్త అమావాస్య వేడుకలకు సిద్ధమైంది. వారం రోజుల నుంచి అమ్మవారిని ప్రత్యేకాలంకరణ చేస్తున్నారు. అమ్మవారి గరగలను పట్టణ వీధుల్లో రోజూ ఊరేగిస్తున్నారు. సోమవారం కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో సుందరంగా అలంకరించగా ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కొత్త అమావాస్య జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ నిర్వాహకులు ఎస్.పద్మావతి విజ్ఞప్తి చేశారు.

ఎలమంచిలిలో.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం కొత్త అమావాస్య జాతరకు వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరానుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాంబిల్లిలో.. కొత్తఅమావాస్య సందర్భంగా మండలంలోని వెల్చూరు, కొప్పుగొండుపాలెం, రాజుకోడూరు, దిమిలి, అప్పారాయుడుపాలెం, కొత్తూరు తదితర గ్రామాల్లో సోమవారం నూకాంబిక అమ్మవారి జాతరలు జరగనున్నాయి. ఆలయాల వద్ద అమ్మవారిని దర్శించుకొనేందుకు నిర్వాహకులు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరంలో.. కొత్త అమావాస్య వేడుకలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఆలయాలను సుందరంగా తయారు చేశారు. భీమవరం, గోకులపాడు, గెడ్డపాలెం, దార్లపూడి, పేటసూదిపురం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

... 3వ పేజీ తరువాయి

తొలుత అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం నలుగురు కోలుకున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన సీహెచ్ రమణ స్వస్థలం విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలంలో గల గొల్లపేట గ్రామం. ఆయన భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 11 ఏళ్లుగా పరిశ్రమలో సూపర్‌వైజర్, కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. తానాంలో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ షిఫ్ట్ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురి కార్మికుల పరిస్థితి గురించి వాకబు చేశారు.

అపిటోరియా పరిశ్రమలో..

అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో వీటీడీ డ్రయర్ రూములో ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) డ్రయర్ రూము బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరుచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ ఒక్కసారిగా రావడంతో పీల్చి కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో డ్రయర్ రూము డోర్ ఓపెన్ అయి శబ్దం రావడంతో సమీపంలో ఉన్న కిటికీ గ్లాస్ పగిలి అక్కడే పనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయమైంది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జీ, మరో ఫిట్టర్ బి. గోవింద స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా కుప్పకూలిన గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని స్వస్థలం పాలకొండ. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

పరిశ్రమలను సందర్శించిన అధికారులు

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు ప్రమాదాలు జరిగిన పరిశ్రమలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

అనకాపల్లి దశ మారుస్తా..

... 3వ పేజీ తరువాయి

ఉన్నారని, వారిలో కేవలం 1,400 మందికే ఉపాధి దక్కిందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి అందరికీ ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టి రైతాంగానికి సహకరిస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. బెల్లం రైతులకు అగ్రి మార్కెట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అనకాపల్లి బెల్లానికి గ్లోబల్ ట్యాగ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి పూర్వ వైభవానికి కృషి

స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హయాంలో ఏసీలు ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. వైద్యం కోసం గర్భిణులు ఆస్పత్రికి వస్తే ప్రతి రోగినీ విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడం అన్యాయమన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకువస్తామని పవన్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంగా అనకాపల్లికి స్థానం దక్కినా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ ప్రభుత్వం ఒక్క శాశ్వత భవనం కూడా నిర్మించలేకపోయిందని విమర్శించారు. నిధులను దోచుకోవడమే వైసీపీ నేతలకు తెలిసిన అభివృద్ధి అన్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం పక్కనే ఉన్న డంపింగ్ యార్డును తొలగిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు విశాఖను గంజాయి కేంద్రంగా మార్చేశారని, కూటమి అధికారంలోకి రాగానే గంజాయి మహమ్మారిని అరికడతామన్నారు. కాపు సామాజిక భవనం కోసం టీడీపీ హయాంలో స్థలం కేటాయిస్తే అక్కడ వైసీపీ కార్యాలయం నిర్మించడం కంటే అన్యాయం ఉందా? అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో 3,416 టిడ్కో ఇళ్లు నిర్మిస్తే రాజకీయ ప్రయోజనాల కోసం 1,200 ఇళ్లను వైసీపీ నేతలకు కేటాయించారని, అన్నింటినీ సరిదిద్దుతామన్నారు.

నూకాలమ్మ జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు

అనకాపల్లి నూకాలమ్మ జాతరను రాష్ట్ర స్థాయి పండగలా నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రజలకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని, రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇస్తామన్నారు. పీలా గోవింద సత్యనారాయణ హయాంలో ప్రారంభించిన పెరుగు బజారు రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తామన్నారు. కశింకోటలో శారదానదిపై వంతెన నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలంటే సీఎం రమేశ్‌ను ఎంపీను చేయాలన్నారు. పేదలు సాగుచేస్తున్న జీడీ, మామిడి రైతులకు, భూములు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామన్నారు. రైతుబజారు ఏర్పాటు చేస్తామన్నారు. నల్లబెల్లంపై ఆంక్షలు ఎత్తివేస్తామన్నారు. శారదానది ఒడ్డున ఉన్న అన్నమయ్య ఉద్యానవన కేంద్రాలు, పెద్దలకు వాకింగ్ ట్రాక్, టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా భవన నిర్మాణాలు చేపడతామన్నారు. బవులవాడు, దర్జీనగర్ రోడ్డు అభివృద్ధి, అనకాపల్లి పూడిమడక రోడ్డును నిర్మాణం చేపడతామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేని మైనింగ్ విధానాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

కోడిగుడ్డు మంత్రిని తట్టుకోలేని సీఎం

కోడిగుడ్డు మంత్రి అవినీతిని తట్టుకోలేకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమర్‌నాథ్‌కు అనకాపల్లిలో టికెట్టు ఇవ్వలేకపోయారని పవన్ ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో భూ కుంభకోణానికి పాల్పడిన మంత్రి తన బినామీలతో ఆక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇనాం భూములను దోచుకున్నారన్నారు. పిసినికాడలో 80 ఎకరాల దళితుల అసైన్డ్ భూమిని తక్కువ ధరకు లాక్కున్నారన్నారు. జగనన్న కాలనీల్లో భూములను అమ్ముకున్నారని, కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణ చేపడతామని హెచ్చరించారు.

పోలవరం మరిచి డ్యాన్స్‌లు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆ పార్టీ నాయకులకు డ్యాన్స్‌లు వేయడం తప్ప సమాధానం చెప్పే సత్తా లేదన్నారు. పోలవరం పూర్తికి కేంద్ర సహాయం అవసరమని, ఇందుకోసం సీఎం రమేశ్ విజయం కీలకమమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించుకుని, సొంత గనులు కేటాయించేలా చూస్తానన్నారు. అందరం కలిసి వస్తే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమేనన్నారు.

11న మత్స్యనారాయణస్వామి జయంతి ఉత్సవాలు

రాంబిల్లి, ఏప్రిల్ 7 : మండలంలోని మత్స్యకార గ్రామాలైన వాడనర్సాపురం, కొత్తపట్నం, వెంకయ్యపాలెం, లోవపాలెం, వాడరాంబిల్లి, గజిరెడ్డిపాలెం గ్రామాల్లో ఈనెల 11వ తేదీన మత్స్యనారాయణ స్వామి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మిడి మహేష్, కార్యదర్శి గురునాథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఇక్కడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాడనర్సాపురం, కొత్తపట్నం మాజీసర్పంచులు చింతకాయల ఎర్రయ్య, చోడిపల్లి సత్యనారాయణ, నేతలు ఉమ్మిడి నగేష్, చోడిపల్లి మంగరాజు, సూరాడ నూకరాజు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపైనే అన్‌లోడింగ్

▸ పట్టించుకోని పోలీసులు



ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ఇటుకలు దిగుమతి చేస్తున్న కూలీలు

ఎలమంచిలి, ఏప్రిల్ 7 : పట్టణ ప్రధాన రోడ్డుపై గంటల తరబడి అన్‌లోడింగ్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రోడ్డుపై లారీ నిలిపి ట్రాక్టరుల్లోకి ఇటుకలు అన్‌లోడింగ్ చేస్తున్నా సరే పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు. అదే సామాన్యులు అయితే రోడ్డుపై సైకిల్ కూడా పెట్టనివ్వని పోలీసులు గంటల తరబడి ప్రధాన రోడ్డుపై అన్‌లోడింగ్ చేస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఫార్మా ప్రమాదాలపై విచారణ చేయాలి

పరవాడ, ఏప్రిల్ 7 : ఫార్మాసిటీలో గల అల్కలీ, అపిటోరియా ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో భద్రత లేకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై కమిటీ వేసి విచారణ జరిపించాలన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

యోగా ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7 : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో పతాంజలి యోగా సమితి హరిద్వార్ పర్యవేక్షణలో యోగా సహ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు యోగా వల్ల జ్ఞాపకశక్తి పెరగడమే కాకుండా భవిష్యత్తులో ఉద్యోగావకాశాలకు కూడా ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పతాంజలి యోగా పీట్ రవిదేవ్‌జీ, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ విష్ణుమూర్తి, అశోక్ ఆర్య, భీశెట్టి దొరమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో కొణతాల ప్రార్థనలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 7: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆదివారం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆశీస్సులను కొణతాల పొందారు.

పలు గ్రామాల్లో ఘనంగా నూకాలమ్మ జాతర



వేంపాడు నూకాలమ్మ ఆలయం వద్ద భక్తుల క్యూ లైన్

నక్కపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కొత్త అమావాస్య పండుగ సందర్భంగా నూకాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వేంపాడు, చీడిక, కొత్తూరు, దోసలపాడు గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ నూకాలమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. దోసలపాడులో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి

▸ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కాశీనాయుడు

కోటవురట్ల ఏప్రిల్ 7: బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. ఆదివారం పాములవాకలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు టీడీపీ పెద్దపీట వేసిందన్నారు. బీసీలకు ఎక్కువ పదవులు ఇచ్చి, ఆర్థిక, సామాజికాభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారన్నారు. జగన్ బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, భాస్కరరావు, పెట్ల లింగం నాయుడు, జీరెడ్డి నానిబాబు, తిరుమలరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు

నక్కపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని జగనన్న కాలనీల్లో సమస్యలు పేరుకుపోయాయి. మండలంలోని నక్కపల్లి, ఉపమాక, పెదతీనార్ల, గొడిచెర్ల, వేంపాడు, బంగారమ్మపేట, ముకుందరాజుపేట, జి.జగన్నాథపురం, రేబాక తదితర గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లలో అనేక సమస్యల తిష్ట వేశాయి. ఉపమాక జగనన్న కాలనీలో పెదబోదిగల్లం, నక్కపల్లి, అయ్యన్నపాలెం, జానకయ్యపేట, ఉపమాక గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. వీరిలో చాలా మంది గృహాలు నిర్మించుకున్నారు. కానీ డ్రైన్లు, రోడ్లు లేకపోవడంతో చినుకు పడితే చెరువులను తలపిస్తోంది. గత నెల రోజుల నుంచి ఉపమాక జగనన్న కాలనీలో అంధకారం అలముకుంది. వీధి లైట్లు వెలగడం లేదు. పొద్దుపోతే పిల్లలను బయటకు పంపడానికి హడలిపోతున్నారు. విషసర్పాల బెడద వెంటాడుతోందని కాలనీలో నివసిస్తున్న వారు చెబుతున్నారు. మరోవైపు దొంగల భయం కూడా వుందని ఆవేదన చెందుతున్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

నేడు నూకాలమ్మ పండగ

అబీద్ సెంటర్‌లో ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి

నేత్ర పర్వంగా పెద్ద జాగారం

నర్సీపట్నం, ఏప్రిల్ 7: పట్టణంలో నూకాలమ్మ పండగ సోమవారం జరగనున్నది. అమ్మ వారి మహోత్సవాల సందర్భంగా ఆదివారం పెద్ద జాగారాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే అమ్మవారి గరగలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పండగ సంద ర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్ ఏర్పాటు చేసి, నీడగా ఉండటానికి టెంట్లు వేశారు. గరగలు ఊరేగింపు పూర్తి చేసుకొని గుడి వద్దకు చేరే సమయానికి భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూలో ఉంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అమ్మవారి దర్శనాన్ని దేవదాయ శాఖ అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు.

లింగంపేట నూకాలమ్మ పండగకు ఏర్పాట్లు

గొలుగొండ, ఏప్రిల్ 7: మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించే లింగంపేట నూకాలమ్మ పండగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవదాయ శాఖ సిబ్బంది తెలిపారు. ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకునేందుకుగాను తొమ్మిది రోజుల పాటు అవకాశం కల్పించినట్టు చెప్పారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ దీపాలతో అంకరించారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదని డివిజనల్ ఎన్నికల అధికారి జయరాం ఆదేశించారు.

ఓఎల్ పురంలో సరుగుడు తోట దగ్ధం

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 7: మండలంలోని ఓఎల్. పురం సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండున్నర ఎకరాల్లో సరుగుడు తోట దగ్ధమైంది. రాజాన శ్రీనివాసరావు, రాయపురెడ్డి వెంకటలక్ష్మి, సబ్బవరపు పెద్దినాయుడుకు చెందిన రెండున్నర ఎకరాల్లో తోట అగ్నికి ఆహుతైందని అగ్నిమాపక అధికారి అప్పలస్వామి తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.70 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

పత్రాలు ఇచ్చి రశీదు పొందండి

నర్సీపట్నం, ఏప్రిల్ 7: జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన నియామక పత్రాలను ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు అందజేసి, వారి నుంచి రశీదు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ.జయరాం సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎంఈవోలు, వీఆర్‌వోలు, మాస్టర్ ట్రైనీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 620 మంది పీవో, ఏపీవోలకు సోమవారం సాయంత్రంలోగా వీఆర్‌వోలతో నియామక పత్రాలు అందజేస్తుందన్నారు. వారి నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు.

వైభవంగా జిల్లేడిపూడి నూకాంబిక జాతర

దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



భక్తులతో పూజలు అందుకుంటున్న నూకాంబిక అమ్మవారు... జాతరలో కోలాటం చేస్తున్న గోవిందపురం మహిళలు

నాతవరం, ఏప్రిల్ 7: జిల్లేడిపూడి (బుచ్చింపేట)లో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే భక్తులు క్యూలో నిలుచుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. తర్వాత ఇక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేసి, తర్వాత ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తీర్థంలో భక్తులు తమకు అవసరమైన వస్తువులను తీసుకుంటున్నారు. ఇక్కడ నూకాంబిక ఆలయ ప్రాంగణంలో ఉన్న భారీ శివలింగానికి, శ్రీకృష్ణ విగ్రహానికి, లక్ష్మీదేవి విగ్రహానికి కూడా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. జాతర జరిగే మూడు రోజులూ భక్తుల కోసం ఆధ్యాత్మికత, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఆదివారం భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నూకాంబిక జాతరలో భక్తులకు తాగు నీరు, మజ్జిగ సరఫరా చేశారు. అలాగే భక్తులకు పలిహోర లడ్డు అందజేశారు.

అనకాపల్లి దశ మారుస్తా..

... 3వ పేజీ తరువాయి

ఉన్నారని, వారిలో కేవలం 1,400 మందికే ఉపాధి దక్కిందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి అందరికీ ఉపాధి కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టి రైతాంగానికి సహకరిస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. బెల్లం రైతులకు అగ్రి మార్కెట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అనకాపల్లి బెల్లానికి గ్లోబల్ ట్యాగ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి పూర్వ వైభవానికి కృషి

స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హయాంలో ఏసీలు ఏర్పాటు చేస్తే, అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. వైద్యం కోసం గర్భిణులు ఆస్పత్రికి వస్తే ప్రతి రోగినీ విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయడం అన్యాయమన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఎన్టీఆర్ ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకువస్తామని పవన్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంగా అనకాపల్లికి స్థానం దక్కినా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ ప్రభుత్వం ఒక్క శాశ్వత భవనం కూడా నిర్మించలేకపోయిందని విమర్శించారు. నిధులను దోచుకోవడమే వైసీపీ నేతలకు తెలిసిన అభివృద్ధి అన్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం పక్కనే ఉన్న డంపింగ్ యార్డును తొలగిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు విశాఖను గంజాయి కేంద్రంగా మార్చేశారని, కూటమి అధికారంలోకి రాగానే గంజాయి మహమ్మారిని అరికడతామన్నారు. కాపు సామాజిక భవనం కోసం టీడీపీ హయాంలో స్థలం కేటాయిస్తే అక్కడ వైసీపీ కార్యాలయం నిర్మించడం కంటే అన్యాయం ఉందా? అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో 3,416 టిడ్కో ఇళ్లు నిర్మిస్తే రాజకీయ ప్రయోజనాల కోసం 1,200 ఇళ్లను వైసీపీ నేతలకు కేటాయించారని, అన్నింటినీ సరిదిద్దుతామన్నారు.

నూకాలమ్మ జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు

అనకాపల్లి నూకాలమ్మ జాతరను రాష్ట్ర స్థాయి పండగలా నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రజలకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని, రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇస్తామన్నారు. పీలా గోవింద సత్యనారాయణ హయాంలో ప్రారంభించిన పెరుగుబజారు రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తామన్నారు. కశింకోటలో శారదానదిపై వంతెన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలంటే సీఎం రమేశ్‌ను ఎంపీను చేయాలన్నారు.

పేదలు సాగుచేస్తున్న జీడీ, మామిడి రైతులకు, భూములు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామన్నారు. రైతుబజారు ఏర్పాటు చేస్తామన్నారు. నల్లబెల్లంపై ఆంక్షలు ఎత్తివేస్తామన్నారు. శారదానది ఒడ్డున ఉన్న అన్నమయ్య ఉద్యానవన కేంద్రాలు, పెద్దలకు వాకింగ్ ట్రాక్, టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా భవన నిర్మాణాలు చేపడతామన్నారు. బవులవాడు, దర్జీనగర్ రోడ్డు అభివృద్ధి, అనకాపల్లి పూడిమడక రోడ్డును నిర్మాణం చేపడతామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేని మైనింగ్ విధానాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు.

కోడిగుడ్డు మంత్రిని తట్టుకోలేని సీఎం

కోడిగుడ్డు మంత్రి అవినీతిని తట్టుకోలేకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమర్‌నాథ్‌కు అనకాపల్లిలో టికెట్టు ఇవ్వలేకపోయారని పవన్ ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో భూ కుంభకోణానికి పాల్పడిన మంత్రి తన బినామీలతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఇనాం భూములను దోచుకున్నారన్నారు. పిసినికాడలో 80 ఎకరాల దళితుల అసైన్డ్ భూమిని తక్కువ ధరకు లాక్కున్నారన్నారు. జగనన్న కాలనీల్లో భూములను అమ్ముకున్నారని, కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణ చేపడతామని హెచ్చరించారు.

పోలవరం మరిచి డ్యాన్స్‌లు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఆ పార్టీ నాయకులకు డ్యాన్స్‌లు వేయడం తప్ప సమాధానం చెప్పే సత్తా లేదన్నారు. పోలవరం పూర్తికి కేంద్ర సహాయం అవసరమని, ఇందుకోసం సీఎం రమేశ్ విజయం కీలకమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించుకుని, సొంత గనులు కేటాయించేలా చూస్తానన్నారు. అందరం కలిసి వస్తే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమేనన్నారు.

ఉలిక్కిపడిన ఫార్మా సిటీ

... 3వ పేజీ తరువాయి

తొలుత అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం కోసం నలుగురిని విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం నలుగురు కోలుకున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన సీహెచ్ రమణ స్వస్థలం విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలంలో గల గొల్లపేట గ్రామం. ఆయన భార్య సత్యవతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 11 ఏళ్లుగా పరిశ్రమలో సూపర్‌వైజర్, కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. తానాంలో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను కంపెనీ షిఫ్ట్ సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురి కార్మికుల పరిస్థితి గురించి వాకబు చేశారు.

అపిటోరియా పరిశ్రమలో..

అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో వీటీడీ డ్రయర్ రూములో ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఆళ్ల గోవింద(32) డ్రయర్ రూము బోల్టు బిగించే క్రమంలో ఒక్కసారిగా డోర్ తెరుచుకుంది. దీంతో లోపల ఉన్న మిథైల్ నైట్రేట్ గ్యాస్ ఒక్కసారిగా రావడంతో పీల్చి కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో డ్రయర్ రూము డోర్ ఓపెన్ అయి శబ్దం రావడంతో సమీపంలో ఉన్న కిటికీ గ్లాస్ పగిలి అక్కడే పనిచేస్తున్న సూపర్‌వైజర్ బి.నరేంద్ర కంటికి తగలడంతో గాయమైంది. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబ్జీ, మరో ఫిట్టర్ బి. గోవింద స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాగా కుప్పకూలిన గోవిందను తొలుత అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని స్వస్థలం పాలకొండ. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలను సందర్శించిన అధికారులు

ప్రమాదం విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, పరిశ్రమల అధికారి చిన్నారావు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్, సీఐ బాలసూర్యారావు ప్రమాదాలు జరిగిన పరిశ్రమలను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలని యాజమాన్యాలకు సూచించారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

... 3వ పేజీ తరువాయి

స్థానిక సీఐ పిన్నింటి రమణ గంగవరంలో ఎక్స్‌కవేటర్, లారీలు ఉన్న, గతంలో కేసులు నమోదైన సుమారు 20 మందితో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించారు. యంత్రాలు సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే కొన్ని రోజులు గ్రావెల్ తరలింపునకు విరామం ఇచ్చి గత రెండు రోజులుగా మళ్లీ తవ్వకాలు ప్రారంభించారు. శనివారం ఉదయం పట్టపగలు ఎక్స్‌కవేటర్ సాయంతో లేఅవుట్ తవ్వేసి మట్టి ని తవ్వుకుపోయారు. దీనిపై స్థానిక సీఐని సంప్రతించగా ఇప్పటికే సుమారు 20 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. ఎన్నికల హడావిడిలో ఉండగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని, నిఘా పెట్టి యంత్రాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు

చోడవరం
నియోజకవర్గం


కేపీ అగ్రహారంలో అమ్మవారికి పూజ చేస్తున్న భక్తులు

ఘనంగా నూకాలమ్మ జాతర

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7: కొత్తఅమావాస్య సందర్భంగా కేపీ అగ్రహారంలో ఆదివారం నూకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారికి అంబలం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, చిటికెలు, చిడతల భజనలు, సాము గరిడీల తదితర ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి దర్శనానికి రానున్న వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలను ఏర్పాటు చేశామని సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ గెలుపునకు కృషి చేయండి

» బీజేపీ చోడవరం ఇన్‌చార్జి రమణమూర్తి


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రమణమూరి

రోలుగుంట, ఏప్రిల్ 4 : కూటమి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ గెలుపుకు కృషి చేయాలని బీజేపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి రమణమూర్తి పేర్కొన్నారు. ఈ నెల 9న చోడవరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం రమేష్ ఆత్మీయ సమావేశం విజయవంతంపై మండల కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సన్నాహకసమావేశంలో ఆ యన మాట్లాడారు. వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. బూత్ స్థాయిలో ప్రతీ కార్యకర్త కష్టించి పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకువెళ్లి ప్రచారం చేయాలన్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలను కలుపుకుని సమష్టిగా విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు, ప్రధాన కార్యదర్శి మామిడి రమణ, పరిసం రాజారావు, మడ్డు నారాయణరావు, పచ్చిగొళ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి'

చీడికాడ, ఏప్రిల్ 7: మాడుగుల నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీకి ఓట్లు వేయాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ కోరారు. మండలంలోని అప్పలరాజు పురంలో ఆదివారం కోనాం, మంచాల, చీడికాడలలో పర్యటించారు. వరహాపురంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కృషిచేయాలని కోరారు. ఈ సమావేశాల్లో వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, యూత్ అధ్యక్షులు గొల్లవిల్లి స్వామినాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ శారద వరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.


పూర్తయిన లోపూడిలో ఎత్తిపోతల పథకం పంపు హౌస్


తుప్పల్లో పథకంకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పడకేసిన 'ఎత్తిపోతల' పనులు

» టీడీపీ హయాంలో పెద్దేరుపై పథకం పనులు ప్రారంభం .. » వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 7: మండలంలో ఎల్‌బీపీ అగ్రహారం ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోవడంతో లోపూడి, ఎల్‌బీపీ.అగ్రహారానికి తదితర మెట్టు భూముల ఆయకట్టు రైతుల ఆశలు అడుగంటాయి. సార్వత్రిక ఎన్నికల ముందు పూర్తవుతాయని రైతులు ఆశించినా నిరాశే ఎదురైంది. ఇటీవల సదరు కాంట్రాక్టరు ఇప్పటి వరకు ఉంచిన నిర్మాణ సామగ్రి పైపులు, వాల్వు తదితరవాటిని తరలించుకుపోయారు. లూలూరు రెవెన్యూలో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ ఆర్గనేజేషన్ (డీఆర్‌డీఓ) సైనిక శిక్షణ కేంద్రం ఏర్పాటుకు లోపూడి, ఎల్‌బీపీ.అగ్రహారం గ్రామాలకు చెందిన వరిసాగు చేస్తున్న 250 మంది రైతులు తమకు చెందిన 120 ఎకరాల పల్లపు భూములను ఇచ్చారు. దీంతో వారికి తిండి గింజలు కొరత ఏర్పడింది. తమ మెట్టు భూములకు ఆయకట్టు అందించి ఆదుకోవాలని రైతులు అప్పటి చోడవరం ఎమ్మెల్యే కేవీఎస్ఎన్ఎస్.రాజును కోరారు. ఈ సమస్యను అప్పటి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన పెద్దేరుపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అంగీకరించారు. భూ నిర్వాసితులైన రైతుల మెట్టు భూములకు నీరందించేందుకు రూ. 4.50 కోట్లు మంజూరు చేశారు. 2016-17లో ఏపీ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఐడీసీ) ద్వారా టెండర్లు దక్కించుకున్న విజయవాడకు చెందిన శ్రీనివాసరావు నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టారు. ట్యాంకు, జాక్‌వెల్, పంపు హౌస్, ఎలక్ట్రికల్ సరఫరాకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మోటార్లు బిగింపు, 3.5 కిలోమీటర్ల పైపులైన్‌కు గాను రైతులు సహకరించారు. ఈ నేపథ్యంలో సుమారు 3 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులను 2018లోనే పూర్తయ్యాయి. ఈ పనులకు రూ.4.5 కోట్లలో సుమారు రూ.3.5 కోట్ల చెల్లింపులను కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. 2018లోనే నీరందుతుందని ఆయకట్టు రైతులు ఎంతగానో ఆశించారు. అయితే, తమ భూములో నుంచి పైపు లైన్‌పై అభ్యంతరం తెలుపుతూ, ఆరుగురు రైతులు 2018లో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. దీంతో మిగిలిన కొద్దిపాటి పైపులైన్ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. కోర్టు స్టేపై కౌంటరు దాఖలు చేయాలని ఐదేళ్లుగా రైతులు చేస్తున్న విజ్ఞప్తులను ఏపీఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదు. ఎల్‌బీపీ.అగ్రహారం ఎత్తిపోతల పథకం పనులు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. అభ్యంతరం వచ్చిన భూముల్లో నుంచి కాకుండా మరోచోట నుంచి పైపులైన్ పనులు చేపట్టేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఐదేళ్లుగా ఎన్ని చేస్తున్నా విజ్ఞప్తులను పట్టించుకునే నాథుడే కరువు కావడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలుకాని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ



చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ వైఫల్యం రైతుల పాలిట శాపంగా మారింది. గత ఎన్నికలతోపాటు పలు మార్లు ఈ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తామని ధర్మశ్రీ ఇచ్చిన హామీలేవీ అమలుకాలేదు. టీడీపీ ప్రభుత్వ హయంలో జోరుగా జరిగిన పనులు, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల ముందు పనులు పూర్తికాగలవని రైతులు ఆశించినా ఫలితంలేకపోయింది.

- తమరాన స్వామి నాయుడు, ఆయకట్టు రైతు, ఎల్‌బిపీ. అగ్రహారం

ప్రత్యామ్నాయ చర్యలతో పనులు పూర్తిచేయాలి



కొద్దిపాటి మిగిలిపోయిన పైపులైన్‌పై వచ్చిన అభ్యంతరాలమేరకు ఆరేళ్లుగా ఎత్తిపోతల పథకం పనులు నిలిపివేయడం తగదు. లూలూరు రెవెన్యూ పరిధిలో డీఆర్‌డీఓ సైనిక శిబిరం కోసం ఎకరంన్నర పల్లం భూమి ఇచ్చాను. స్థానిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ ఇచ్చిన హామీతో నమ్మిలోపూడి, ఎల్‌బిపీ.అగ్రహారంల్లో సర్పంచ్‌లను గెలిపించాం. కానీ, ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులుపూర్తి కాలేదు. నిర్వాసిత రైతు కుటుంబాలు ఆరేళ్లుగా తిండి గింజల కొరతతో అలమటించాల్సి వస్తోంది.

-గుడూరు రమణ, ఆయకట్టు రైతు, ఎల్‌బిపీ.అగ్రహారం

తగ్గిన చింత పండు ధర.. గిరిజనుల దిగాలు


ఆదివారం సంతలో నిరీక్షిస్తున్న చింత పండు తెచ్చిన రైతులు

దేవరాపల్లి, ఏప్రిల్ 7: చింత పండు ధర ఈ వారం పడిపోయింది. గత రెండు వారాలుగా పది కిలోలు రూ. 600 నుంచి 700 వరకు ధర పలకగా , ఈవారం రూ. 450 నుంచి 500కు దిగిపోయింది. ఆదివారం జరిగే సంతకు దేవరాపల్లి మండలంలో నాలుగు గిరిజన పంచాయతీలు, అనంతగిరి మండలంకు చెందిన నాలుగు పంచాయతీల గిరిజనులు చింత పండు తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. గత రెండు వారాల నుంచి పది కిలోలు 700 వరకు ధర పలకింది. ఈవారం రెండు వేల టన్నులు వరకు చింత పండు వచ్చింది. అయితే వ్యాపారులు, వినియోగ దారులు ఇళ్ల అవసరాల కోసం ఏడాదికి సరిపడా కొనుగోలు చేస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు, మైదాన ప్రాంతానికి చెందిన నాగయ్యపేట, సీతంపేట, కాశీపురం, శ్రీరాంపురం, గంగవరం, నందిపల్లి వెంకటరాజపురం, తెనుగుపూడి గ్రామాల నుంచి రైతులు చింత పండు తెచ్చారు. ధర తగ్గిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు

స్థలాలు ఇచ్చారు.. పట్టాలు తీసుకున్నారు

» జెడ్.గంగవరం పంచాయతీ పరిధిలో లబ్ధిదారుల గగ్గోలు


జెడ్.గంగవరంలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీ స్థలం ఇదే..

మాకవరపాలెం, ఏప్రిల్ 7: ప్రభుత్వం రెండేళ్ల కిందట ఎంతో ఆర్భాటంగా ఇచ్చిన జగనన్న ఇళ్ల పట్టాలు అధికారులు తిరిగి లాక్కోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మండలంలో జెడ్.గంగవరం పంచాయతీలో జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం గ్రామాలకు చెందిన పేదలకు జగనన్న కాలనీలో సెంటున్న స్థలాల చొప్పున పట్టాలు మంజూరు చేశారు. జెడ్.గంగవరం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కొండప్రాంతంలో 48 మందికి ఈస్థలాలు కేటాయించారు. అయితే, కాలనీలో రెండేళ్లుగా ఎటువంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ కోసమంటూ లబ్ధిదారులు నుంచి పట్టాలను హౌసింగ్ అధికారులు తీసుకున్నారు. అయితే, వారికి వేరొక చోట స్థలాలు చూపించకుండా ఇళ్ల పట్టాలు తీసుకున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండప్రాంతంలో పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించలేదని వారు ఆరోపిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఇటీవల ఇంటింటికి వలంటీర్లు మంజూరుచేసిన కర పత్రాల్లో ఇంటి పట్టాలు మం జూరు చేసినట్టు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తీసుకున్న పట్టాలను తిరిగి మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు.

మాడుగుల
నియోజకవర్గం

'సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు వివరించాలి'


కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ నేత దేముడు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 7: టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు పేర్కొన్నారు. ఆదివారం చింతలూరు, గొటివాడ అగ్రహారం గ్రామాల్లోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మండలస్థాయి నాయకులను కలసి పలు అంశాలు చర్చించారు. కూటమి అభ్యర్థులను గెలుపించుకునేలా కృషి చేయాలన్నారు. రా ష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఈస్థితిలో టీడీపీ అందించనున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సామాజిక పింఛన్ రూ. 4వేలకు పెంచడంపై ప్రజల నుంచి ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల రమేశ్, వడ్డిరాజ్‌కుమార్, గంగరాజు, వరహామూర్తి, రాజు, చంటి, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎ. కొత్తపల్లిలో గుర్రం పరుగు పోటీలు

దేవరాపల్లి, ఏప్రిల్ 7: మండలంలోని ఎ. కొత్తపల్లిలో నూకాంబికా అమ్మవారి పండగ, ఉగాది పురస్కరించుకొని ఈనెల8వతేదీన గుర్రపు పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ చింతల వెంకటరమణ తెలిపారు. ప్రథమ బహుమతి పదివేలు, రెండవ బహుమతి 8వేలు, మూడవ బహుమతి ఆరువేలు, నాల్గవ బహుమతి నాలు వేలు, ఐదవ బహుమతి రెండువేలు అందిస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ,అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

'మాడుగులలో టీడీపీ విజయం ఖాయం'


కలిగొట్ల గ్రామంలో టీడీపీ కార్యకర్తలతో పైలా ప్రసాదరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 7: టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కూటమి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. ఆదివారం కలిగొట్లలో కార్యకర్తలతో సమావేశ మయ్యారు. బాబు షూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. బొడ్డు జగదీశ్వరరావు, దొగ్గ.దేమున్నాయుడు, వెంకటరావు, సిమ్మినాయుడు, లెక్కల సత్యనారాయణ, రాజినాయుడు తది తరులు పాల్గొన్నారు.

చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ విజయం ఖాయమని కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని చుక్కపల్లిలో శనివారం రాత్రి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు హారతులు, కళాకారులు తప్పెట గుళ్లతో స్వాగతం పలికారు. ఈ ప్రచారంలో ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలను వివరిస్తూ ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ నా యకులు శరగడం శివ, పేరపు కొండబాబు, కసిరెడ్డి గణపతి, పాతాళం ఎర్రునాయుడు, రెడ్డి రాము, గొర్లె గణేశ్, పేరపు అప్పారావు, మురుకుర్తి జోగినాయుడు, ఎ.ప్రసాద్, తుంపాల శేషు తదితరులు పాల్గొన్నారు.